సంచలన దినపత్రిక

# హంస కలం వార్త

PRGI :T/TG/2026/0126/4786/1242








తెలంగాణ - ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక :59,చీఫ్ ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి,వెల రూ. 4/-, సోమవారం 16- 03 - 2026


## గ్రామీణ మహిళలు ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు కావాలి : మంత్రి సీతక్క

భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైంది ఆదివాసీ కుటుంబం నుంచి ప్రజాసేవలోకి..



హైదరాబాద్: బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా జీవితం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాల ఫలితమని మంత్రి సీతక్క అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ వార్తలు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన

## మాట ఇచ్చాం.. పనులు చేస్తాం.. గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా!

'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు

- ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది
- 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మార్పు మొదలు కావాలి
- మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం
- సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు



అమరావతి: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గం, నందిగరువు గ్రామంలో శనివారం నిర్వహించిన 'గిరిజనులతో మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'డోలి మోత'లతో ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామం నుంచి మార్పు మొదలు కావాలని, అందుకే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సమస్యలు ఏవైనా రాత్రికి రాత్రే పరిష్కారం కావు, కానీ పరిష్కరించాలనే సంకల్పం మాకుంది. ప్రధానమంత్రి నిధులతోనే ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం సాధ్యమైంది. గత ప్రభుత్వంలో ఈ నిధులు ఏమయ్యాయో మీరు నాయకులను నిలదీయాలి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాం, పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయిస్తున్నాం. నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం, కానీ నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే, కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం

జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.


నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదు

అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు

అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు.


ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంద



## సీఎం రేవంత్ రెడ్డిని ఇఫ్తార్ విందుకు ఆహ్వానించిన మంత్రి అజారుద్దీన్

## గ్యాస్ కష్టాలు: పనుల్లేక సొంతూళ్లకు వలస కూలీలు



తిరువనంతపురం: దేశాన్ని ఎల్పీజీ కొరత అతలాకుతలం చేస్తోంది. వంట గ్యాస్ దొరక్క వందలాది హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడటంతో మరో పెను సంక్షోభం తెరపైకి వచ్చింది. ఉపాధి కోల్పోయిన వేలాది మంది వలస కార్మికులు తమ సొంత రాష్ట్రాలకు తిరుగుపయనం అవుతున్నారు. కేరళలోని హోటల్ రంగం ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలపైనే ఆధారపడి నడుస్తోంది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, మరోవైపు రంజాన్ పండుగ

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్.. త్వరలో భారత్‌కు వస్తానని సందేశం



ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ఇండియా టుడే కాన్క్లేవ్ 2026 సదస్సులో ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త,

## అప్పర్ కృష్ణా ప్రాజెక్టు ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం



- ★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలను బలంగా ఎదుర్కొనేందుకు కర్ణాటక సిద్ధమైంది
- ★ మార్చి 17న ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు
- ★ శనివారం బాగల్‌కోట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.
- ★ "ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే మాకు కేటాయించిన నీటి వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టు పనులు చేస్తున్నాం

# బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

- గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష
- రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశాం
- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు
- గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు



హైదరాబాద్, : గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడించారు. ఇవాళ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా

## ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి



- తాడేపల్లిలో లక్ష్మీపార్వతి మీడియా సమావేశంలో మాట్లాడారు
- కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి
- మహిళలపై ఎమ్మెల్యేలే అత్యాచారాలు చేస్తున్నారని ఆమె అన్నారు

## అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన



రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు

గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి

ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు

## ఫలించిన దౌత్యం.. హార్ముజ్ దాటనున్న మరిన్ని భారత ట్యాంకర్లు



భారత నౌకలకు త్వరలోనే సురక్షిత మార్గం లభిస్తుందని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలీ శుక్రవారం సూచించారు ఈ నౌకల భద్రతను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది

## గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు



గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే

ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారు

ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు

డైలీ న్యూస్ పేపర్ హంస కలం

సోమవారం 16- 03 - 2026

# ఫలించిన దౌత్యం..

## హోర్ముజ్ దాటనున్న మరిన్ని భారత ట్యాంకర్లు

ఢిల్లీ: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నడుమ హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు మార్గం సుగమమైంది. ఇప్పటికే రెండు ఎల్పీజీ నౌకలు ఈ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన నేపథ్యంలో, మరిన్ని భారత ట్యాంకర్లు ఈ కీలక జలమార్గాన్ని దాటేందుకు సిద్ధంగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు శనివారం తెలిపాయి. భారత నౌకలకు సురక్షిత మార్గాన్ని కల్పిస్తామని ఇరాన్ హామీ ఇవ్వడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి చర్చల ఫలితంగా రవాణాకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ రంగ సంస్థ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'శివాలిక్', 'నందా దేవి' అనే రెండు చమురు ట్యాంకర్లు ఇప్పటికే భారత్‌కు బయల్దేరాయి. మరో రెండు రోజుల్లో ఇవి ముంబై లేదా కాండ్లా పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. 'శివాలిక్' నౌకకు భారత నౌకాదళం భద్రత కల్పిస్తోంది. 'నందా దేవి' నౌక 46,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో వస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) మార్చి 12 నాటి సమాచారం ప్రకారం, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో మొత్తం 28 భారత నౌకలు ఉన్నాయి. వీటిలో 778 మంది భారత సిబ్బంది ఉన్నారు. ఈ నౌకల్లో సుమారు 2.15 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ, 4.15 లక్షల టన్నుల ఎల్పీజీ, 17.5 లక్షల టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకల భద్రతను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో 20 శాతం హోర్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. భారత నౌకలకు త్వరలోనే సురక్షిత మార్గం లభిస్తుందని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలీ శుక్రవారం సూచించిన సంగతి తెలిసిందే.

## గ్యాస్ కష్టాలు: పనుల్లేక సొంతూళ్లకు వలస కూలీలు

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, మరోవైపు రంజాన్ పండుగ దగ్గరపడుతుండటంతో వీరంతా ముందస్తుగానే ఇళ్లకు తరలి వెళుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయానికి వారం ముందు వెళ్లే వీరు, ఇప్పుడు గ్యాస్ కొరత వల్ల హోటళ్లు మూతపడటంతో పనులు లేక ముందుగానే సొంతూళ్లకు తరలివెళ్లిపోతున్నారు. 'ఎల్పీజీ సంక్షోభం మధ్య చిన్న తరహా హోటల్ యజమానులు తమ సిబ్బందిని కాపాడుకోలేకపోతున్నారు. ఒక్కసారి వీరు తమ గ్రామాలకు వెళ్తే మళ్లీ రెండు మూడు నెలల వరకు తిరిగి రారు. ఇది కేరళలోని అన్ని రంగాలపై ప్రభావం చూపుతుంది' అని కేరళ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. జయపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలోని వలస కార్మికులలో సుమారు 50 శాతం మంది ఎన్నికలు జరగబోయే బెంగాల్, అస్సాం ప్రాంతాల వారేనని గణాంకాలు చెబుతున్నాయి. కొందరు యజమానులు గ్యాస్‌కు బదులు ఇతర ఇంధనాలను వాడుతూ పనివారిని ఆపే ప్రయత్నం చేస్తున్నా, పరిస్థితులు ఆశాజనకంగా లేవు. తిరువనంతపురంలోని ప్రముఖ మాల్స్‌కు సిబ్బందిని సరఫరా చేసే ఏజెన్సీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గతంలో 25 మంది పనిచేసే చోట ఇప్పుడు కేవలం ఐదుగురు మాత్రమే మిగిలారు. ప్రస్తుతానికి స్థానిక మహిళలతో పనులు కానిస్తున్నా, వలస కూలీలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ సమస్య త్వరగా పరిష్కారం అయితేనే కేరళ ఆతిథ్య రంగం తిరిగి కోలుకునే అవకాశం ఉంది.

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్..
## త్వరలో భారత్‌కు వస్తానని సందేశం

మొదటి పేజీ తరువాయి

ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2026 సదస్సులో ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ట్రంప్, మోదీ మధ్య ఉన్న బలమైన స్నేహబంధాన్ని ఈ సందేశం మరోసారి స్పష్టం చేసింది. గతంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఉన్న స్నేహం ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా 2020లో ట్రంప్ భారత పర్యటన సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల మధ్య నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమం వారిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకుంటూ ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని ఇఫ్తార్ విందుకు
## ఆహ్వానించిన మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మార్చి 15వ తేదీన ఈ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని కలిసి ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ స్పందిస్తూ, "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈ పవిత్ర రంజాన్ మాసంలో మార్చి 15న జరిగే ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాను. ఈ పవిత్ర సమయం అందరిలో శాంతి, కృతజ్ఞత, ఐక్యతను తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఉపవాసాన్ని విరమించే ప్రక్రియనే ఇఫ్తార్ అంటారు. ఈ మాసంలో నాయకులు, ప్రముఖులు మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే మంత్రి అజారుద్దీన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే,
## కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## గ్యాస్ సరఫరా, వినియోగంపై
## పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, వినియోగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని, దీనివల్ల బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు విధించినట్టు తెలిపారు. డబుల్ సిలిండర్ ఉన్న వారికి 32 రోజుల చొప్పున రీఫిల్ బుకింగ్‌పై పరిమితి విధించినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ... ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రిఫైనరీలను ఆదేశించిందని, ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు ఉత్పత్తి మన దేశంలోనే జరుగుతోందని వెల్లడించారు. హోటల్ అసోసియేషన్లతో కూడా చర్చలు జరుపుతున్నామని, వారు బొగ్గుతో నడిచే తందూరి బట్టీల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. సోలార్ కుకింగ్ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రధాన ఆలయాల్లో ఇప్పటికే స్టీమ్ కుకింగ్ అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో గ్యాస్ ధరలు పెరగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆర్టీజీఎస్ ద్వారా అన్ని బృందాలతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించనున్నారని వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే హోటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# గ్రామీణ మహిళలు ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు కావాలి : మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ వార్తలు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన 'షీ స్పార్క్ 2026 ' కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) శనివారం పాల్గొని ప్రసంగించారు. ఓ జాతీయ మీడియా సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీ ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో తన జీవితం, మంత్రిగా తీసుకున్న కీలక నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన పలు ప్రశ్నలకు తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.



ఆదివాసీ కుటుంబం నుంచి ప్రజాసేవలోకి..

ఈ సందర్భంగా సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ముందుకు సాగుతున్న మహిళా నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన నిర్వాహకులను ఆమె అభినందించారు. వ్యాపారవేత్తలు, పరిశోధకులు, ఐటీ నిపుణులు, రచయితలు, కళాకారులు, పరిపాలనాధికారులు వంటి అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రేరణనిచ్చే విషయమని అన్నారు. ఇలాంటి వేదికలు మహిళల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. తాను రాజకీయ కుటుంబం నుంచి రాలేదని, ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రజాసేవలోకి వచ్చానని మంత్రి గుర్తుచేశారు. ఒకప్పుడు అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన తన జీవితం తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం పెరిగి ప్రధాన ప్రవాహంలోకి వచ్చానని తెలిపారు. విద్య ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని నమ్మి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేశానని, అనంతరం ప్రజల సేవ కోసం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తన జీవిత ప్రయాణాన్ని 'బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు' అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యం ద్వారా సాధించే మార్పు శాశ్వతమని మంత్రి సీతక్క అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, తర్వాత అదే కోర్టులో న్యాయవాదిగా నిలిచిన సందర్భం తన జీవితాన్నిమలుపు తిప్పిందన్నారు. మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు.. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఇది సాధ్యమైందని ఆమె తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా రాష్ట్రంలో 46 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి సామాజిక-ఆర్థిక మార్పుకు దోహదపడుతున్నారని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, చిన్న మధ్యతరహా వ్యాపారాలకు రుణాలు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి విధానం ద్వారా మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. స్వయం సహాయక సంఘాలు బస్సులు నిర్వహించడం, కమ్యూనిటీ క్యాంటీన్లు నడపడం, వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం, పాఠశాల యూనిఫార్మ్‌లు తయారు చేయడం వంటి అనేక రంగాల్లో ముందంజలో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి బజార్'ద్వారా గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను నగర మార్కెట్‌కు నేరుగా విక్రయించే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బలపడతాయని, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. దేశ అభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ... గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు అవకాశాలు కల్పించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీ అమ్మాయి మంత్రి కాగలిగిందని... సంకల్పం, విద్య, ప్రజాస్వామ్యం ఏ జీవితాన్నైనా మార్చగలదని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహించిన YourStory సంస్థ స్థాపకురాలు శ్రద్ధా శర్మ, నిర్వాహకులను మంత్రి సీతక్క అభినందించారు. మహిళలు అభివృద్ధిలో భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకులుగా నిలిచే భవిష్యత్తును కలిసి నిర్మిద్దామని ఆమె పిలుపునిచ్చారు.

# బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 11 లక్షలు ఉజ్వల పథకం, 28 లక్షలు దీపం పథకం కింద ఉన్నాయని వెల్లడించారు. అదనంగా 7.5 లక్షల కమర్షియల్ కనెక్షన్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెల రాష్ట్రంలో 58 లక్షల నుంచి 60 లక్షల వరకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని మంత్రి వివరించారు. ఇటీవల కొన్ని రోజులుగా ప్రజల్లో ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా కూడా ఎక్కువగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినట్లు మంత్రి చెప్పారు. అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.





రాష్ట్రంలో రోజుకు సుమారు 23 వేల కమర్షియల్ సిలిండర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 6,200 మాత్రమే సరఫరా చేయగలుగుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతం పరిమితిలోనే జరుగుతోందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ సప్లయ్ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ సరఫరా సంబంధిత ఫిర్యాదుల కోసం 180042500333 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

## ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై జరుగుతున్న దారుణాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి మండిపడ్డారు. తాడేపల్లిలో లక్ష్మీపార్వతి మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని చెప్పారు. హహిళలపై ఎమ్మెల్యేలే అత్యాచారాలు చేస్తున్నారని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి వ్యక్తిని టీటీడీ ఛైర్మన్‌గా నియమించారో అందరికీ తెలుసని లక్ష్మీపార్వతి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు న్యాయం జరిగిందని ఆమె అన్నారు. చంద్రబాబు నాయుడు సిగ్గుమాలిన నాయకుడని ఆమె మండిపడ్డారు. 'రాష్ట్రం అత్యాచారాల ఆంధ్రప్రదేశ్ గా మారిపోయింది. కొందరు ఎమ్మెల్యేలు కూడా మహిళలపై దారుణాలకు పాల్పడటం సిగ్గుచేటు. పాపాలను పంచుకోవటంలో జనసేన కూడా భాగం పంచుకుంటోంది. పోలీసులను పనికిమాలిన వారిగా మార్చేశారు. కిరణ్ రాయల్, అరవ శ్రీధర్, కోనేటి ఆదిమూలం, నసీర్ అహ్మద్, కూన రవికుమార్.. ఇలా చెప్పుకుంటే ఎంతోమంది మహిళలను వేధించారు. దేవుడే లేడన్న చంద్రబాబు సీఎం అయ్యారు. పూజ దీపం దగ్గర సిగరెట్ ముట్టిస్తాడంటూ తన తండ్రి గురించి చెప్పిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. ఇలాంటి వారి చేతిలో రాష్ట్రం అధోగతి పాలవుతోంది. మహిళలకు అన్యాయం చేసిన వారు ఏమయ్యారో చరిత్ర చూస్తే తెలుస్తుంది. చంద్రబాబు మహిళలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పుడు మేకతోలు కప్పుకుని స్తోత్రాలు మాట్లాడవద్దు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడి వీడియోలు బయటకు వస్తే ఏం చర్యలు తీసుకున్నారు? ఒక మహిళ స్వయంగా లేఖ రాసినా చంద్రబాబు ఎందుకు పట్టించుకోలేదు? దేవునితో కూడా ఆటలు ఆడుకోవటం సరికాదు. జగన్ హయాంలో దిశ యాప్, దిశా పీఎస్ లు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించారు. ఇలాంటి మేలు చేయటం చంద్రబాబు చరిత్రలో లేదు. ప్రజలు ఎంత అసహ్యించుకుంటున్నారో బయటకు వస్తే తెలుస్తుంది. ఆడపిల్లలను స్కూల్‌కి పంపాలన్నా కూడా ఇప్పుడు పేరెంట్స్ భయపడుతున్నారు.

## మాట ఇచ్చాం.. పనులు చేస్తాం..
## గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా!



మొదటి పేజీ తరువాయి

నాయకులకు ఈ ప్రాంతాలకు రావాలంటేనే భయం, కానీ నేను ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని కాబట్టి ఎవరికీ భయపడను. మీ సమస్యలు తెలుసుకోవడానికి ముందుకు వచ్చానని' ఆయన అన్నారు. నందిగరువు గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, 1.6 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో మ్యాజిక్ డ్రైన్లు మంజూరు చేశారు. అలాగే, సుమారు 3 వేల గ్రామాలకు తాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## అప్పర్ కృష్ణా ప్రాజెక్టు
## ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం



ఢిల్లీ: అప్పర్ కృష్ణా జలాల ప్రాజెక్టు (యూకేపీ) మూడో దశ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలను బలంగా ఎదుర్కొనేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, మార్చి 17న ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. శనివారం బాగల్‌కోట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, దానికి సంబంధించిన భూసేకరణను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై కేంద్రం తమ నుంచి వివరణ కోరిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఏపీ వైఖరికి వ్యతిరేకంగా తమ వాదనను ఢిల్లీలో బలంగా వినిపిస్తామని శివకుమార్ స్పష్టం చేశారు. "ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే మాకు కేటాయించిన నీటి వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచే ఆలోచన లేదు. కేవలం మా వాటా నీటిని వాడుకోవడానికే ప్రయత్నిస్తుంటే, దానికి కూడా ఏపీ అభ్యంతరం చెప్పడం సరికాదు" అని ఆయన అన్నారు. ఇదే సమయంలో, తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటకకు చెందిన సుమారు 30 టీఎంసీల నీరు వృథాగా పోతోందని, ఈ వృథాను అరికట్టేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం సహకరించడం లేదని శివకుమార్ ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై చర్చించి, కేంద్రంపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని ఖరారు చేసేందుకు తాను, మంత్రులు హెచ్.కే. పాటిల్, ఎం.బి. పాటిల్, బోసరాజులతో కలిసి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన వివరించారు. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో ఎంపీలతో ఈ సమావేశం జరగనుంది.

## అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై
## మంత్రి నారాయణ కీలక ప్రకటన

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. అమరావతి పరిధిలోని అనంతవరం, నెక్కల్లు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులతో కలిసి నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీ ఇచ్చారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గ్రామ కంఠాల బయట ఏ తరహా అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయో, గ్రామాల్లో కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ వ్యవస్థ, ఎల్ఈడీ వీధి దీపాలు, నాణ్యమైన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని... పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజధాని నిర్మాణ గడువులపై కూడా నారాయణ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల నివాస భవనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే, 2027 జూన్ నాటికి 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ భవనాలు 2028 డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. నిన్ననే ఉండవల్లి వద్ద స్టీల్ బ్రిడ్జ్ పనులను పరిశీలించిన మంత్రి, నేడు నేరుగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించడం విశేషం.


## బండి సంజయ్ పాదయాత్రలో... డ్రోన్ తగిలి తేనెటీగల దాడి

హైదరాబాద్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాదయాత్ర సందర్భంగా తేనెటీగలు దాడి చేశాయి. 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు చేపట్టిన పాదయాత్రలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రామడుగు మండలం కోన్‌రావుపేట సమీపంలో పాదయాత్ర దృశ్యాలను చిత్రీకరించేందుకు పలువురు అభిమానులు డ్రోన్ ఎగురవేశారు. అది పక్కనే ఉన్న చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు తగిలింది. దీంతో తేనెటీగలు లేచి, పలువురు కార్యకర్తలపై దాడి చేశాయి. తేనెటీగల దాడితో కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. తేనెటీగలు నలుగురు కార్యకర్తలపై దాడి చేశాయి. అప్రమత్తమైన బండి సంజయ్, ఆయన సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనంతరం వైద్యులు బండి సంజయ్‌కి రొటీన్ వైద్య పరీక్షలు చేశారు. ఆ తర్వాత పాదయాత్ర తిరిగి ప్రారంభమైంది. ఈ అంజన్న ఆశీర్వాద యాత్ర కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు 40 కిలోమీటర్లు కొనసాగుతుంది. ఉదయం ప్రారంభమైన ఈ యాత్ర సాయంత్రానికి చేరుకుంటుంది.

## కీలక రంగాల్లో భాగస్వామిగా తెలంగాణ..
## టాంజానియా బృందంతో మంత్రి

హైదరాబాద్: డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలెప్మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ సిద్ధం చేస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. 'తెలంగాణ - టాంజానియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. 'మీ సేవ' ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, 'వీ హబ్' మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక 'నాలెడ్జ్ పార్ట్నర్'గా వ్యవహరిస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై మార్గనిర్దేశం చేస్తామన్నారు. బ్లూ ఎకానమీ, టూరిజంలో టాంజానియా అవలంభిస్తోన్న బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం చేసి... తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 'డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే.. తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంవోయూ కుదుర్చుకుంటాం' అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా ముబ్రాక్ ఖమిస్, జాంజిబార్ ఐసీటీ అథారిటీ సీఈవో శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో - హెడ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

# చిట్కుల్ శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయం రెండవ వార్షికోత్సవం పూజా కార్యక్రమంలో పాల్గొన్న బేబీ రామచందర్ యాదవ్





**మార్చి 15 (హంస కలంన్యూస్):** సంగారెడ్డి జిల్లా చిట్కుల్ గ్రామం రమణీయ ఎన్క్లేవ్ పోచమ్మ దేవాలయం అమ్మవారి రెండవ వార్షికోత్సవానికి కాలనీ అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్ తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కార్యదర్శి ఆర్కే మారుతి ముదిరాజ్, వరుణ్ ఆహ్వానం మేరకు పూజోత్సవంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, కౌన్సిలర్ నీలం కవిత ముదిరాజ్ బృందం. కాలనీ సంఘం మరియు ఐక్యవేదిక కార్యదర్శి మారుతి ముదిరాజ్, వరుణ్ ఆహ్వానం మేరకు బేరి రామచంద్ర యాదవ్ ఆర్కే సాయన్న ముదిరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి రవి సుభాష్ పాల్గొని పూజలు చేయడం జరిగింది. నీలం మధు ముదిరాజ్ సతీమణి కౌన్సిలర్ నీలం కవిత మహిళా మణులు పూజలు చేయడం జరిగింది. యువత పెద్దలు బాలబాలికలు కాలనీ వాసులు మొత్తంగా అందరు పాల్గొని పూజలు చేసి టెంకాయలు కొట్టి ఘనంగా రెండవ వార్షికోత్సవం జరుపుకోవడం విశేషం. తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ అమ్మవారికి పూజలు చేసి ప్రజలందరూ సుఖశాంతులతో ఐకమత్యంతో హాయిగా కాలం గడపాలని శాంతి కాముకులై ఐకమత్యంతో కాలనీ అభివృద్ధి చేసుకోవాలని కాలనీ వాసులకు కూడా అమ్మవారి ఆశీర్వాదం దయ ఉండాలని వేడుకోవడం జరిగింది. అమ్మవారి దేవాలయం నిర్మాణం చేసి రెండు సంవత్సరాలు అయినందున చిట్కుల్ గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామస్తులు ముత్తంగి మిగతా కాలనీవాసులు కూడా పాల్గొనడం జరిగింది వార్డ్ మెంబర్స్ కౌన్సిలర్స్ ప్రజలు పాల్గొనడం జరిగింది. అమ్మవారి ప్రసాదంతో పాటు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. కాలనీ కార్యవర్గం, పూజారి అరుణ్ పంతులు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరుపుకోవడం, అధ్యక్షులు కృష్ణ, శ్రవణ్ కుమార్, వరుణ్, ముత్యాలు మిగతా పెద్దలు, మహిళలు యువత బాలబాలిక కాలనీవాసులు పాల్గొనడం గొప్పగా ఘనంగా వార్షికోత్సవం జరిగింది. అమ్మవారి ఈ ఉత్సవ కార్యక్రమంలో పూజారి అరుణ్ పంతులు తో పాటు ముఖ్య అతిథులు నీలం మధు ముదిరాజ్ సతీమణి కవిత తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి, కార్యదర్శి మారుతి ముదిరాజ్ రవి చారి, నాయి బ్రాహ్మణ సంఘం సుభాష్,, నిర్వాహకులు తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ఆర్కే మారుతి ముదిరాజ్ శ్రావణ్ కుమార్ ముత్యాలు కాలనీ అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, వరుణ్ కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతంగా అమ్మవారి వార్షికోత్సవం ఘనంగా గొప్పగా చేయడం జరిగింది.

# ముబారక్‌పూర్--ఏ, వెల్టూర్, కొనాపూర్, నాగసన్‌పల్లి గ్రామాల్లో రూ. 29 లక్షతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సదాశివపేట **మార్చి 15 (హంస కలంన్యూస్):** సదాశివపేట మండలంలోనిముబారక్‌పూర్--ఏ, వెల్టూర్, కొనాపూర్, నాగసన్‌పల్లి గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (చీ=జు+ూ) నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి ఈ రోడ్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

పనులు ప్రారంభమైన గ్రామాల వివరాలు:

ముబారక్‌పూర్--ఏ -- రూ. 7 లక్షలు

వెల్టూర్ -- రూ. 8 లక్షలు

కొనాపూర్ -- రూ. 8 లక్షలు


నాగసన్‌పల్లి -- రూ. 6 లక్షలుఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కి డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు కార్యక్రమానికి హాజరై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అనంతరం కొనాపూర్ గ్రామానికి చెందిన వార్డ్ సభ్యులు ఆశం, ఆదిల్ ఇద్దరూ గ్రామ సర్పంచ్ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల వరకు మాత్రమే పార్టీలు, రాజకీయాలు ఉంటాయని, ఆ తర్వాత ప్రజలు గెలిపించిన ప్రతినిధులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సర్పంచులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక వాగ్దానాలు ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. ఉచిత హామీలు, పెద్ద పెద్ద వాగ్దానాలు చేసి ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కానీ ప్రస్తుతం ఏ వర్గాల ప్రజలు కూడా సంతోషంగా లేరని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దగోల్ల ఆంజనేయులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడిల సుధీర్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ ,ఏఈ కోటేశ్వరరావు, ముబారక్ పూర్ సర్పంచ్ నవీన్ కుమార్, కోనాపూర్ సర్పంచ్ అనిల్ రెడ్డి, వెల్టూర్ సర్పంచ్ తోట కిష్టయ్య, నాగ్సన్పల్లి సర్పంచ్ రవికుమార్ బబ్బిలిగామా సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్లు లక్ష్మారెడ్డి, శేఖర్ ,నల్లల కుమార్ ,గడ్డమిది సత్యనారాయణ ,దశరథ్ మాణిక్ రెడ్డి , శ్రీనివాస్ మాజీ ఎంపిటిసిలు శివకుమార్ రాములు నాయకులు శంభు ప్రసాద్ ,హుస్సేన్, శివకుమార్ ,రాందాస్ ,పండరి దేవయ్య సంతోష్ జాఫర్ అంజయ్య వినోద్ ఆంజనేయులు ,రవికుమార్ ,జాఫర్ ఆయాగ్రామల ఉప సర్పంచ్లు వార్డు మెంబర్లు కార్యకర్తలు పాల్గొన్నారు



# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఝలక్

## ఆల్విన్ కాలనీ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు





**మార్చి 15 (హంస కలంన్యూస్):** బిఆర్ఎస్ నాయకులు అనిల్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో చేరిన కాంగ్రెస్ నాయకులు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కామెంట్స్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ ఆశీస్సులతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరికెపూడి గాంధీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి ఆస్తులను సంపాదించడం కాపాడుకోవడం కోసమే పనిచేయడం తప్పితే ప్రజల గురించి ఆలోచించని నాయకులకు ఓటుతో సమాధానం చెప్పాలనీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశాడు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్లో బిఆర్ఎస్ నాయకులు అనిల్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గం లో 10 సంవత్సరాలలో టిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్పితే కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధి కోసం చేరానని చెబుతున్న అరికెపూడి గాంధీ గతంలో ఎల్లమ్మబండ ప్రజలు ఇండ్లు కట్టుకుంటే వాళ్లకు పట్టాలు ఇప్పించమని అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన గాంధీ ఎల్లమ్మబండ ప్రజలకు రిజిస్ట్రేషన్లు చెప్పించాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. టిఆర్ఎస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తొలగించడం నాయకులను బెదిరించడం నీళ్లు రాకుండా చేయడం గొప్పకాదని ఎవరైనా ఇబ్బంది పెట్టిన పార్టీ కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే మాధవరం హామీ ఇచ్చాడు. లోపల బిఆర్ఎస్ బయట కాంగ్రెస్ పార్టీ అని చెబుతున్న అరికెపూడి గాంధీ మీకు చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలవాలని ప్రజలు చాలా తెలివిగలవారిని రాబోయే రోజుల్లో ఓటుతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

# నమ్మించి వంచించింది.. ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం..

## 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న బాలానగర్ పోలీసులు!





**మార్చి 15 (హంస కలంన్యూస్):** "అయ్యో పాపం" అని ఆశ్రయమిస్తే.. అదను చూసి ఆ ఇంటికే కన్నం వేసిన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. నమ్మిన వారిని మత్తులో ముంచి, లక్షల విలువైన సొత్తుతో ఉడాయించిన కేటుగాళ్లను పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శ్ నగర్ నివాసితురాలు యర్రమిల్లి హిమ బిందు వద్దకు ఆమె దూరపు బంధువైన చేరకుపల్లి లక్ష్మి సర్వాణి (35) కొద్దిరోజుల క్రితం వచ్చింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పడంతో మానవత్వంతో హిమ బిందు ఆమెకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించారు. అయితే, ఈ ఆదరణను ఆసరాగా చేసుకున్న లక్ష్మి సర్వాణి.. ఇంటిని దోచుకోవాలని పథకం పన్నింది. మార్చి 13న ఇంట్లో వారు అప్రమత్తంగా లేని సమయంలో వారికి మత్తు పదార్థం ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసింది. అనంతరం తన అనుచరులైన పర్వతం కిరణ్ కుమార్ (30), కొనపర్తి యశ్వంత్ (19), భారడి దిలీప్ (23) మరియు శివ సహాయంతో ఇంట్లోని విలువైన బంగారు, వెండి ఆభరణాలను దోచుకుని పరారైంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బాలానగర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలను (జజు౦, సెల్ టవర్ డేటా) విశ్లేషించారు. నిందితులు తప్పించుకునే లోపే శనివారం వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన సూత్రధారి లక్ష్మి సర్వాణితో పాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, శివ అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. నిందితుల వద్ద నుండి పోలీసులు భారీగా రికవరీ చేశారు మొత్తం విలువ సుమారు రూ. 50 లక్షలుగా తెలిపారు. అందులో బంగారం: 30 తులాలు, వెండి: 2.3 కిలోలు, 4 సెల్ ఫోన్లు ఉన్నాయి. కేసు నమోదైన 24 గంటల వ్యవధిలోనే దొంగలను పట్టుకుని, సొత్తును స్వాధీనం చేసుకున్న బాలానగర్ సీఐ నర్సింహా రాజు, క్రైమ్ బృందాన్ని ఏసీపీ నరేష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సిబ్బందికి నగదు పురస్కారాలను అందజేశారు.



# ఆల్విన్ కాలనీ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు,



**మార్చి 15 (హంస కలంన్యూస్):** రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ ఉపాధ్యక్షులు అల్లూరి రామరాజు పుట్టినరోజు సందర్భంగా ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు రామరాజు గారిని శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, అల్లూరి రామరాజు ఎన్నో సంవత్సరాలుగా బీజేపీ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ పార్టీకి అంకితభావంతో సేవలు అందిస్తున్న నిబద్ధత గల నాయకుడని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజా సేవలో ముందుండి పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలతో నిండిన దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.

# సైబరాబాద్ లో వీకెండ్ స్పెషల్ డ్రంక్ డ్రైవ్..262 మందిపై కేసులు







**మార్చి 15 (హంస కలంన్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి × రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 262 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 205 ద్విచక్ర వాహనదారులు,05 ఆటోలు,50 కార్లు, 02 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే ---233 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 19 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 10 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (09.03.2026--14.03.2026) లో మొత్తం 187 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో02 మందికి జరిమానా, జైలు శిక్ష, 23 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,162 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# కష్టపడే వారికే పార్టీలో గుర్తింపు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్: బండి రమేష్



కూకట్పల్లి ప్రతినిధి, **మార్చి 15 (హంస కలంన్యూస్):** కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు గౌరవం ఉంటుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ గాంధీభవన్లో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమానికి వెళ్లిన రమేష్ ఆమెకు పూల బొకే ఇచ్చి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు పొంది ప్రజలకు మరింత చేరువగా ఉండాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో సంధ్య రజిత రాధా కల్పన శైలజ తదితరులు పాల్గొన్నారు

# మహిళా దినోత్సవ వేడుకలు



శేరిలింగంపల్లి ప్రతినిధి, **మార్చి 15 (హంస కలంన్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ చందానగర్ డివిజన్ లోని క్రిస్టల్ గార్డెన్స్ నందు నేడు మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకలుకు "టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్" వి.జగదీశ్వర్ గౌడ్ తో కలిసి "ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ ని ముఖ్యఅతిధిగా ఆహ్వానించటం జరిగింది.. వారి ఆహ్వానంమేరకు కార్యక్రమంలో పాల్గొని వేడుకలో పాల్గొన మహిళలను, చిన్నారిలని అభినందించారు.. ఈ సందర్బంగా వి.జగదీశ్వర్ గౌడ్ మాట్లాడతు మహిళా దినోత్సవం అంటే మహిళలకు తమ హక్కులు గురించి అవగాహన కలిపించటం, సమాజంలో, కుటుంబంలో సమాన హక్కులు అవకాశాలు పొందటం అని అన్నారు. మహిళలు ఈ రోజులో అని రంగాలలో అందరితో సమానంగా ఉన్నారని ఎందులో తక్కువ కాదు అని అన్నారు. చివరిగా మనం అందరం మహిళలకు సురక్షితమైన సమాన అవకాశాలు నిర్మిదాం, గౌరవిద్ధం, ప్రోత్సహిదాం అని తెలుపుతూ, మహిళలు అందరికి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు..కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువతీ యువకులు టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీక్రెట్ డిన్నర్ మీటింగ్!



**మార్చి 15 (హంస కలంన్యూస్):** ఒకేసారి 15 మంది ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపగా... గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 9 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా హాజరు. కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి దక్కకుండా అడ్డుకుంటున్నారని భావిస్తూ, కొంతకాలంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈ రహస్య డిన్నర్ మీటింగ్‌తో రాజకీయ వర్గాల్లో భారీ చర్చ మొదలైంది. బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి జాయినింగ్ వార్త నుంచి కోలుకోకముందే, ఈ 9 మంది ఎమ్మెల్యేల సమావేశం కాంగ్రెస్‌కు మరో షాక్‌గా మారింది. ఈ మీటింగ్ కొత్త రాజకీయ సమీకరణాలకు సంకేతమా? లేక పెద్ద రాజకీయ కుదుపుకి నాందా? రాజగోపాల్ రెడ్డి కూడా బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ పెరుగుతోంది.

## అభివృద్ధికి, సంక్షేమానికి వేదికలు కమ్యూనిటీ హాళ్లు పాండు బస్తీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్




**మార్చి 15 (హంస కలంన్యూస్):** 130 – సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ పాండు బస్తీ కమ్యూనిటీ హాల్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అభివృద్ధికి, సంక్షేమానికి చక్కని వేదికలు కమ్యూనిటీ హాళ్లు అని అన్నారు. గత పన్నండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ కాలనీలు, బస్తీలల్లో మౌలిక వసతులతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను చేపట్టి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, మహమ్మద్ యూసుఫ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, ప్రభాకర్, కట్టా సుందర్, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, ప్రెసిడెంట్ మీన్ కుమార్, ప్రభాకర్ బస్తీ వాసులు కోశాధికారి చంద్రారెడ్డి, సలహాదారులు రవీందర్, ఆర్గనైసింగ్ సెక్రటరీ శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రొయ్య సుధాకర్, వినోదా, వరలక్ష్మి, బీహార్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డైలీ న్యూస్ పేపర్ హంస కలం

సోమవారం 16- 03 - 2026

### రాత్రి పూట డిన్నర్ చేశాక వాకింగ్

# చేస్తే ఎన్నో అద్భుతమైన ఫలితాలు



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే వ్యాయామం అంటే మరీ కష్టపడి జిమ్‌లలో కసరత్తులు చేయాల్సిన పనిలేదు. రోజూ కనీసం 30 నిమిషాల పాటు సాధారణ వాకింగ్ చేసినా చాలు. ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం వాకింగ్ చేయడం వల్ల రోజంతా మెటబాలిజం ఎక్కువగా ఉంటుంది. ఇది క్యాలరీలను కరిగిస్తూనే ఉంటుంది. కనుకనే ఉదయం వ్యాయామం చేయాలని వైద్యులు చెబుతుంటారు. అయితే కేవలం ఉదయం మాత్రమే కాదు.. రాత్రి పూట భోజనం అనంతరం కూడా వాకింగ్ చేయాలి. దీంతో మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయడం ఎన్నో మంచి ఫలితాలను ఇస్తుందని వారు అంటున్నారు.

**అధిక బరువు, షుగర్ లెవల్స్..**

రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కనీసం 10 నిమిషాల పాటు తేలికపాటి నడక కొనసాగించాలి. రాత్రి పూట మన మెటబాలిజం తగ్గుతుంది. కానీ వాకింగ్ చేస్తే మెటబాలిజంను పెంచుకోవచ్చు. దీంతో రాత్రి మనం నిద్రించినా కూడా మన శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తూనే ఉంటుంది. ఫలితంగా మనం నిద్రలో ఉన్నా కూడా మన శరీరంలోని కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట డిన్నర్ తరువాత వాకింగ్ చేస్తే ఎన్నో మంచి ఫలితాలను పొందవచ్చు. ఇక రాత్రి పూట భోజనం అనంతరం వాకింగ్ చేయడం వల్ల షుగర్ లెవల్స్‌న అదుపులో ఉంచుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాత్రి డిన్నర్ తరువాత వాకింగ్ చేసేవారి ఫాస్టింగ్ షుగర్ లెవల్స్ చాలా వరకు తగ్గాయని తేల్చారు. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ షుగర్ లెవల్స్‌ను తగ్గించుకునేందుకు గాను రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయాలి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం.

**కొలెస్ట్రాల్ లెవల్స్..**

కొలెస్ట్రాల్ లెవల్స్ అధికంగా ఉన్నవారు రోజూ కచ్చితమైన డైట్‌ను పాటిస్తూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అప్పుడే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. అయితే రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేయడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ గణనీయంగా తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు రోజూ రాత్రి వాకింగ్ చేస్తే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే రోజూ రాత్రి వాకింగ్ చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. భోజనం చేసిన వెంటనే గ్యాస్ వస్తుందని, కడుపు ఉబ్బరంగా ఉంటుందని భావించే వారు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేస్తే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

సాధారణంగా భోజనం చేసిన వెంటనే శరీరంలో రక్త సరఫరా మొత్తం జీర్ణాశయం వైప చేరుతుంది. కానీ రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే రక్త సరఫరా మెరుగు పడుతుంది. హైబీపీ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. బీపీ ఉన్నవారు రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. రాత్రి డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పనితీరు మెరుగు పడుతుంది. రాత్రి వాకింగ్ చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# 140 కోట్ల జనాభా

రోజుకు 70 కోట్ల లీటర్ల క్రూడ్ ఖర్చు చేస్తున్నాం



న్యూఢిల్లీ, **మార్చి 15 (హంస కలంన్యూస్):** మనం సాధారణంగా రోడ్డు మీద చూసే 5000 లీటర్ల ఛాంబర్స్ తో 4 ఛాంబర్స్ ఉండే పెద్ద ఆయిల్ టాంకర్ అంటే 20 వేల లీటర్ల కెపాసిటీ ఉండే 35,000 ఆయిల్ ట్యాంకర్స్ ఆయిల్ ఉపయోగిస్తున్నాం. ఒక నెలరోజులకు సరిపోయే క్రూడ్ నిల్వ చేయాలి అంటే 10 లక్షల ఆయిల్ ట్యాంకర్స్ పట్టే ఆయిల్ నిల్వ చేయగలిగే స్టోరేజీ ట్యాంకర్స్ ఉండాలి. రోజూ రెండు/మూడు ఋజజ ఆయిల్ ట్యాంకర్స్ సముద్రం ద్వారా మన దేశం ఆయిల్ తీసుకుని వస్తూ ఉంటే కానీ మన రోజూ డిమాండ్ తట్టుకోలేం. యుద్ధం ప్రారంభం అయ్యే నాటికి మన వద్ద రెండు నెలలకు పైగా సరిపోయే నిల్వలు ఉన్నాయి. ఇవి ఖాళీ అవుతూ ఉంటే మళ్ళీ వాటిని పై దేశాల నుండి వచ్చే ఆయిల్ తో నింపుతూ ఉంటేనే మనకు ఆయిల్ ఇబ్బందులు రావు. కానీ, ఈ రోజుకు యుద్ధం ప్రారంభం అయి 15 రోజులు అయింది. గతంలో లాగా ఆయిల్ ట్యాంకర్ షిప్స్ సముద్రంలో ధైర్యంగా ప్రయాణించలేవు. ఆయిల్ రవాణాకు తమ షిప్పుల అద్దెకు ఇవ్వడానికి చాలా షిప్పింగ్ వెనుకంజ వేస్తున్నాయి. ఇస్తున్న కంపెనీలు కూడా అద్దెలు భారీగా పెంచేశారు. యుద్ధం భయం చేత క్లెయిమ్స్ ఎక్కువ వస్తాయి అని భయంతో ఇన్సూరెన్స్ కంపెనీలు ఇన్సూరెన్స్ చార్జీలు చాలా భారీగా పెంచేసాయి. యుద్ధం వల్ల కొన్ని గల్ఫ్ దేశాలు క్రూడ్ ఉత్పత్తి తగ్గించాయి. దాని వల్ల క్రూడ్ ధర కూడా బారెల్ ?100 దాటింది. పైన చెప్పుకున్న కారణాలు వల్ల లాజిస్టిక్ చార్జీలు అంటే రవాణా మరియు ఇన్సూరెన్స్ చార్జీలు ప్రతీ బేరల్ కు ఏ5 నుండి ఏ10వరకు పెరిగాయి. ఈ కారణాలు వల్ల అన్ని దేశాల్లో పెట్రోల్ చార్జీలు అప్పుడే వారం క్రింద నుండి పెంచుతూ వస్తున్నారు. బాగా ధనిక దేశాలు మరియు పెట్రోల్ తామే ఉత్పత్తి చేసుకునే అమెరికా, కెనడా సౌదీ అరేబియా వంటి దేశాలు,మరియు చైనా వంటి దేశాలు కూడా ధరలు పెంచాయి. ఈ పరిస్థితి ల్లో కూడా దాదాపు ప్రతీ లీటరు ఆయిల్ దిగుమతి చేసుకుంటే గానీ రోజు గడవని భారత దేశం మాత్రం 15 రోజులు అయి యుద్ధం మొదలు అయినా ఈ రోజు వరకు మన ఆయిల్ మీద రూపాయి పెంచకుండా భారత ప్రభుత్వం మేనేజి చేసేంది. ఇది నిజంగా ఒక మిరకిల్. ఎందుకంటే ఇంత తీవ్ర సమస్యలు మధ్య కూడా ధరల స్థిరత్వానికి ప్రాధాన్యత ఇచ్చి ద్రవ్యోల్బణం పెరిగి ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా ఉండటానికి తగు చర్యలు తీసుకుంటోంది.కానీ సముద్ర మార్గం ద్వారా ఆయిల్ వచ్చే పరిస్థితిలు లేని అసాధారణ పరిస్థితులు ఉన్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం ఈ వత్తిడి ఎంత వరకు భరించగలదు అనేది చూడాలి. డీజిల్ దేశంలో రవాణా కు అతి ముఖ్యమైనది కాబట్టి డీజిల్ మీద కొద్దిగా పెంచి పెట్రోల్ మీద ధరలు భారీగా పెంచి వినియోగం అదుపు చేయాలి. లేకపోతే రాబోయే రోజుల్లో ఇలాగే యుద్ధం కొనసాగితే పెట్రోల్ బంకుల్లో లీటరు పెట్రోల్ దొరకడం కూడా గగనం అయిపోతుంది. ఈ ఫిబ్రవరి నుండి +20 దేశాల్లో పెరిగిన పెట్రోల్ ధరలు (భారతీయ రూపాయల్లో)

| కరెన్సీ | ఫిబ్రవరి 1 | మార్చి 12 -(?) | మార్పు(%) |
|---|---|---|---|
| అమెరికా | 71.30 | 87.05 | 22% ? |
| కెనడా | 87.05 | 105.18 | 21% ? |
| ఇటలీ | 165.99 | 191.60 | 15% |
| జర్మనీ | 191.60 | 220.35 | 15% ? |
| ఫ్రాన్స్ | 190.54 | 212.89 | 12% ? |
| దకొరియా | 107.59 | 119.74 | 11% ? |
| చైనా | 97.49 | 108.25 | 11% ? |
| టర్కీ | 116.02 | 127.36 | 10% ? |
| జపాన్ | 91.22 | 98.71 | 8% ? |
| అర్జెంటీనా | 101.82 | 108.62 | 7% ? |
| యూకే | 161.79 | 170.38 | 5% ? |
| బ్రెజిల్ | 105.85 | 109.32 | 3% ? |
| ఆస్ట్రేలియా | 18.73 | 137.03 | 0.01% ? |
| మెక్సికో | 121.51 | 122.91 | 1% ? |
| సౌత్ ఆఫ్రికా | 110.24 | 111.34 | 1% ? |
| ఇండోనేషియా | 54.69 | 54.69 | 0 |
| సౌదీ అరేబియా | 57.43 | 57.43 | 0 |
| ఇండియా | 94.77 | 94.77 | 0 |
| రష్యా | 78.23 | 77.63 | 0 |

మనం కూడా పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు కొన్ని రోజులు పెట్రోల్ డీజిల్ పొదుపుగా ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి.

# కెపిహెచ్బి కాలనీ సిక్స్ పేస్ సీనియర్ సిటిజన్ బిల్డింగ్ నందు




**మార్చి 15 (హంస కలంన్యూస్):** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్ట్యూట్ వారి సౌజన్యంతో కెపిహెచ్బి కాలనీ కీర్తిశేషులు శ్రీమతి మందలపు రోజా రాణి జ్ఞాపకార్థం రోజా రాణి భర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ శిబిరానికి సుమారుగా 300 మంది స్త్రీ పురుషులు పాల్గొని స్క్రీనింగ్ చేయించుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మందలపు సాయిబాబు చౌదరి గత ఒకటిన్నర సంవత్సరంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్ట్యూట్ వారి సహకారంతో కేపీహెచ్బీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎన్నో మెడికల్ క్యాంప్ నిర్వహించారని ప్రజా ఆరోగ్య విషయంలో ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు క్యాన్సర్ మహమ్మారి పెద్ద ఎత్తున విరుచుకుపడుతుందని దానిని అరికట్టాలంటే ప్రాథమికంగా క్యాన్సర్ క్లీనింగ్ ద్వారా తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని




తెలియజేశారు రాబోయే రోజుల్లో కూకట్ పల్లి నియోజకవర్గం అంతట బసవతారకం వారి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు చేయించే విధంగా చర్యలు తీసుకుంటారని తెలియజేశారు, ఈ సందర్భంగా సాయిబాబు చౌదరి మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి పెరుగుతుందని ,మారుతున్న మన జీవన విధానాల వల్ల ప్లాస్టిక్ మన జీవితంలో భాగం అయినందువల్ల క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తుందని, దానిని నివారించాలి అంటే స్క్రీనింగ్ ద్వారా మనం ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని ఒకవేళ క్యాన్సర్ లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే డాక్టర్ సూచనల మేరకు మందులు వాడితే తగ్గిపోతుందని అంతేకాకుండా, క్యాన్సర్ రాకుండా 15 సంవత్సరాల వయసు నుంచి 35 సంవత్సరాల వయసు వరకు ప్రివెంటు వ్యాక్సిన్స్ ఉన్నాయని అవి వేయించుకోవడం ద్వారా గా క్యాన్సర్ రాకుండా అరికట్టవచ్చని ప్రతి వ్యక్తి అవేర్నెస్ ద్వారా క్యాన్సర్ని అరికట్టవచ్చని సాయిబాబా చౌదరి తెలియజేశారు కార్యక్రమంలో సిక్స్ ప్లేస్ సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి , సుబ్బరాజు, లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ సాయిబాబా చౌదరి సమాజ హితమైన కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు ఎల్లవేళలా ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని కొనియాడారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విజయ్ కుమార్ చౌదరి, రామారావు, కోటేశ్వరరావు, అప్పారావు, సాంబశివారెడ్డి, భానుమతి , తిరుమలమ్మ, రామకృష్ణ, బివి సుబ్బరాజు, జూంం బోస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు,కాజా నవీన్, చిలుకూరి గోవిందరాజు, రామ్, గంగాధర్, దత్తు, నైన్ యాడ్స్ లక్ష్మణ్, లెక్చరర్ శ్రీనివాస్, జయప్రకాష్, శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనాథ్, తేజ, తదితరులు పాల్గొన్నారు

# ఆత్మ నివేదన

గత 127 వారాలుగా 'కాశీమజిలీ కథలు' అనుసృజనను ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలు. 1930వ దశకంలో 12 భాగాలుగా మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథల విశిష్టతను గురించి, ఈ అనుసృజనలో ఆ కథలను చెప్పేందుకు అనుసరించిన నిబంధనలను గురించి క్లుప్తంగా తెలియచేస్తూ.. ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం. తెలుగులో కాశీమజిలీ కథలకున్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. సంసార వ్యామోహాన్ని విడిచిపెట్టి సన్యాసం స్వీకరించిన మణిసిద్ధుడు అనే యతి.. కాశీయాత్ర చేయాలని నిశ్చయించుకుంటాడు. అయితే యాత్రలకు ఒంటరిగా వెళ్లరాదనే నియమాన్ని పురస్కరించుకుని, తనకు తోడుగా రమ్మని ఒక గోపాలకుణ్ని కోరుతాడు. కథలంటే మక్కువ కలిగిన ఆ గోపాలకుడు.. 'దారిలో కనిపించే విశేషాలన్నిటినీ నాకు విడమరిచి చెబితేనే మీతో వస్తా!' అని షరతు పెట్టాడు. మణిసిద్ధుని వద్ద ఒక అపురూపమైన మణి ఉంది. దాని సాయంతో దారిలో కనిపించిన ప్రతి విశేషాన్ని తెలుసుకుని, ఎప్పటికప్పుడు మణిసిద్ధుడు ఆ గోపాలకుడికి కథలు కథలుగా చెబుతాడు. అవే కాశీ మజిలీ కథలు. 1930వ దశకంలో మధిర సుబ్బన్న దీక్షిత కవి రచించిన కాశీమజిలీ కథలు తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించాయి. చిన్నా పెద్దా తేడాలేకుండా, పండిత పామరులనే భేదం లేకుండా.. ఒకప్పుడు తెలుగు వారందరూ కాశీమజిలీ కథలను ఆస్వాదించినవారే! పూర్తి జానపద శైలితో సాగినప్పటికీ, సామాన్యులకు అంతగా రుచించని వేదాంత, వ్యాకరణాది అంశాలను పరమార్థ బోధారూపంగా అందించిన అద్వితీయ రచన కాశీమజిలీ కథలు. మధిర సుబ్బన్న దీక్షితులు ఈ కథలను రచించేనాటికి తెలుగులో నవలలు లేవు. చిన్నవైనా, పెద్దవైనా కథలు మాత్రమే! కాశీమజిలీ కథల్లో 359 మజిలీలు ఉంటాయి. ఆ మజిలీలన్నిటిలో 'కథ' అనే పేరు కనిపిస్తుంది. లెక్కకు మిక్కిలిగా కథలుంటాయి. ఉదాహరణకు మొదటి సంపుటంలో వరప్రసాదుల కథ ఉంటుంది. ఇది అయిదుగురు స్నేహితుల కథ. ప్రధాన కథ ఇదే అయినప్పటికీ.. వేర్వేరు శీర్షికలకు కూడా కథ అనే పేరుతోనే పేర్కొన్నారు. ఈ అనుసృజనలో ప్రతిభాగానికీ వేర్వేరు శీర్షికలను ఉంచినప్పటికీ ప్రధాన కథ ప్రారంభాన్ని, ముగింపునీ తప్పనిసరిగా తెలియచేశాం. ఆవిధంగా చూస్తే ఇప్పటివరకు 28 కథలను మీరు చదివారు. ఇంకా మిగిలిన కథలేమయ్యాయి?! వాటిని ఎందుకు చెప్పలేదు!? అనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా స్మరించాల్సి ఉంది. కాశీమజిలీల్లో ప్రధాన కథ ఎప్పుడూ మణిసిద్ధుడనే యతి.. గోపాలకుడనే సహాయకుడికి బోధించినట్లుగా మొదలవుతుంది. కథలో చర్చించబోయే విషయాన్ని నాటకఫక్కీలో ముందుగా వారిద్దరి మాటల్లో చర్చించారు. అయితే ఈ అనుసృజనలో వారిద్దరి పాత్రలనూ పక్కన పెట్టినప్పటికీ అసలు స్మరించకుండా ఉండలేదు. ఇక, వరప్రసాదుల కథలోనే కృష్ణదేవరాయల వృత్తాంతం ఇమిడి ఉంటుంది. కృష్ణరాయని కథను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దిన రచయిత, అందులోనే తిమ్మరుసు కథ, గజపతులతో సంబంధం వగైరా కథలను హేతుబద్ధంగానూ, చరిత్రకు అందే విధంగానూ రచించారు. అయినప్పటికీ ఈ అనుసృజనలో చారిత్రక పురుషులపై వచ్చిన కథలను తప్పించడం జరిగింది. కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్న దీక్షితులు.. 1. జానపద ఇతివృత్తాలు, 2. చారిత్రక ఇతివృత్తాలు, 3. కావ్యకథలు, 4. పౌరాణిక కథలు అనే విభాగాల నుంచి స్వీకరించి రచించారు. ఇందులో ఇప్పటివరకు మనం జానపద ఇతివృత్తాలను మాత్రమే చదువుకున్నాం. కృష్ణరాయని కథతో పాటుగా.. జగన్నాథ పండితరాయలు, తెనాలి రామలింగడు వంటి చారిత్రక పురుషుల కథలను అప్పటి పండిత పామరులను రంజింపచేసే విధంగా సుబ్బన్న దీక్షితులు రచించారు. అవి ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి బాగుంటాయి. జనబాహుళ్యాన్ని కాస్త తికమక పెడతాయి. కనుకనే వాటిని విడిచిపెట్టడం జరిగింది. రెండో సంపుటంలో పూరీ జగన్నాథుని అవతార నేపథ్యానికి సంబంధించిన ఇంద్రద్యుమ్న మహారాజు వృత్తాంతాన్ని యథాతథంగా వర్ణించాం. 8వ సంపుటిలోని పౌరాణికమైన మదాలస కథను చెప్పాం. పురాణ పాత్రల నేపథ్యాలతో వచ్చిన మరికొన్ని కథలనూ చెప్పాం. విక్రమార్కుడు ఉట్టికోసిన కథ, భేతాళుని వశం చేసుకున్న కథ ఒక క్రమపద్ధతిలో లేవు. అవన్నీ ఇతరత్ర బహుళ ప్రాచుర్యంలో ఉన్నవే. కాశీమజిలీల్లోనివే అయిన విక్రమార్కుని మనుమని కథను చదువుకున్నాం. కానీ, అతను పాతాళానికి వెళ్లి విభీషణుడు మొదలైన రాక్షసులను కలుసుకోవడం వగైరా కథలను నేటితరం వారికి ఓ పట్టాన కొరుకుడు పడవు కనుక, విడిచిపెట్టాం. వీణావిద్వాంసుని కథ చాలా చిన్నదే కానీ, మజా కలిగించే కథ కాదు. నాలుగు కులాలకు చెందిన నలుగురు కన్యలు ఒకే వరుణ్ని వరించిన కథను కూడా ఈ శీర్షికలో చెప్పలేదు. 5వ సంపుటిలోని శంకరవిజయాన్ని ఈ అనుసృజనకారుడు గతంలో నవలగా రచించారు. కనుక ఇక్కడ మళ్లీ చెప్పలేదు. అలాగే అదే సంపుటిలోని కాదంబరి అనే కావ్యకథను కూడా విడిచిపెట్టాం. ఈ అనుసృజనలో మూలంలోని వర్ణనాసౌందర్యాన్ని చెడగొట్టలేదు. ఏ ముఖ్యవిషయాలు చెప్పడం ద్వారా పాఠకుల స్థాయి పెరిగేలా మూలకర్త వాటిని రచించారో.. వాటిని చెప్పకుండా వదిలి పెట్టలేదు. కాశీమజిలీ కథలకు రెండో మూడో సరళ అనువాదాలు వచ్చాయి. ఇందులోని అనేక కథలను విఠలాచార్య వంటివారు పలు సినిమాల్లో ఉపయోగించుకున్నారు. జగదేకవీరుని కథ, చిక్కడు దొరకడు.. వంటి హిట్ సినిమాలు కాశీమజిలీల్లోని ముఖ్యమైన థాట్‌ని ఉపయోగించుకుని చేసిన కథలే. కాశీమజిలీలను రూపొందించడంలో మధిర సుబ్బన్న దీక్షితకవి చూపించిన రచనా నైపుణ్యం అనితర సాధ్యం. అయినప్పటికీ ప్రతికథకూ ప్రాచీన సాహిత్యపు మూలాలు కూడా కొన్ని ఉన్నాయి. ప్రధానంగా కథాసరిత్సాగరం కనిపిస్తుంది. అలాగే సంస్కృత కావ్యాలలోని కథలను తనదైన భాషలోకి మలుచుకుని, గమ్మత్తయిన మలుపులతో మధిర సుబ్బన్న దీక్షితులు ఆరోజుల్లో ఆబాలగోపాలాన్ని అలరించారు. నేటికీ ఈ కథలు వీటికివే సాటి అని చెప్పుకోవాలి. ఈ అనుసృజనకు ఇది చివరి భాగం. కాశీమజిలీల్లోని తొలిభాగం మణిసిద్ధుడనే యతికి, గోపాలకుడికి మధ్య సంభాషణతో మొదలు అవుతుంది. 12వ సంపుటిలో కాశీమాహాత్మ్య గాథలుంటాయి. అవన్నీ మన పౌరాణికాలను పరమార్థ బోధారూపంగా చెప్పినవి. కాశీఖండం నుంచి స్వీకరించిన దివోదాసు కథ ప్రత్యేకంగా ఇందులో వర్ణించారు. ఈ కథ పద్మకల్పంలోని స్వాయంభువ మనువు కాలానికి చెందినది. అప్పట్లో అరవై ఏళ్లపాటు భూమిపై అనావృష్టి సంభవించింది. పాడిపంటలు నశించాయి. ప్రజలు విషూచి, మశూచి మొదలైన దారుణ రోగాలపాలయ్యారు. ప్రజలు కోటానుకోట్లుగా మరణిస్తుండగా, యమధర్మరాజు విసిగిపోసాగాడు. యజ్ఞయాగాదికాలు చెడ్డాయి. మానవులకు కలుగుతున్న అన్యాయానికి ఇంద్రాదులను నిలవేసి అడిగేవారే కరవయ్యారు. ఈ విశేషాలన్నీ నారదుడి వల్ల విన్న బ్రహ్మదేవుడు.. స్వాయంభువ మనువు వంశంలో పుట్టిన రిపుంజయుణ్ని ధరణీచక్రాన్ని పాలించవలసిందిగా నియమించాడు. రిపుంజయుని పేరును దివోదాసుగా మార్చాడు. అయితే దివోదాసు ఒక షరతు పెట్టాడు. "దేవతలకు స్వర్గం, నాగులకు పాతాళం ఉండగా.. వారు ఈ భూమిమీద ఎందుకు సంచరించాలి? వాళ్లు భూమి వదిలిపోవాలి. నేను కాశీని రాజధానిగా పాలిస్తాను.. కనుక శివుడు కూడా అక్కడినుంచి వెళ్లిపోవాలి" అన్నాడు. బ్రహ్మదేవుడు అతని కోరికను శివునికి విన్నవించగా.. "బ్రహ్మా! నీవు చేసిన నిర్ణయానికి కట్టుబడి.. నేను మందర పర్వతానికి వెళ్లిపోతాను. నేను తిరిగి వచ్చేదాకా ఈ ధరణీచక్రాన్ని దివోదాసుడే ఏలనీ" అన్నాడు. దివోదాసు అధికారం చేపట్టగానే నేలపై పాతాళవాసులను తరిమికొట్టాడు. తన బలంతో వర్షదేవతలను శాసించి వర్షాలు కురిపించాడు. దాంతో భూమి సస్యశ్యామలమైంది. నేలపై ధర్మం నాలుగు పాదాలతో నడవ సాగింది. కొంతకాలం జరిగిన పిమ్మట దివోదాసు రాజ్యంలో పుట్టలోని పామువల్ల పుత్రుణ్ని పోగొట్టుకున్న ఆటవికులు న్యాయంకోసం అతని వద్దకు వచ్చారు. వారికి ఆ పుత్రుణ్ని తిరిగి ఇచ్చే నిమిత్తం.. దివోదాసు కథంతా చిత్రవిచిత్రాలతో సుబ్బన్న దీక్షితులుగారి శైలిలో సుందరంగా సాగుతుంది. ఆ కథలో భాగంగా రసాతలం నుంచి నాగులు, యక్షులు మొదలైనవారంతా భూమిపై నివసించడానికి తగిన అనుమతిని దివోదాసు మంజూరు చేశాడు. కానీ, దేవతలను మాత్రం రానివ్వలేదు. కాశీని విడిచి ఉండటం ఇష్టంలేని దేవతలు బృహస్పతికి మొరపెట్టుకున్నారు. ఆయన సూచన మేరకు భూలోకంలో అగ్నిదేవుడు తన తత్వాన్ని ఉపసంహరించాడు. వాయువు స్తంభించాడు. వరుణుడు వర్షించడం మానేశాడు. దేవతల కపటం గ్రహించిన దివోదాసు, తన యోగవిద్యాబలంతో తానే సర్వదేవతామయునిగా మారిపోయాడు. రాజ్యాన్ని ఎప్పటిలా పాలించసాగాడు. కాశీనగరం శివుని నివాసభూమి. ఆయన కాశీవియోగాన్ని సహించలేక ముందుగా అరవైనాలుగు మంది యోగినీస్త్రీలను కాశీకి పంపాడు. వారు కాశీలో స్థిరపడిపోయారు. ఆలస్యం భరించలేక, శివుడు తరువాత సూర్యుడిని పిలిచాడు. "దివోదాసును ఏదోవిధంగా ధర్మవిముఖుడిని చేయి" అని కోరాడు. కానీ ఆ పని సూర్యుడివల్ల కూడా కాలేదు. అటుపై ఈశ్వరుని ఆజ్ఞపై బ్రహ్మ బ్రాహ్మణ వేషంలో కాశీకి వెళ్లి.. దశాశ్వమేధ యాగాలతో ఈశ్వరుడిని ప్రతిష్ఠించి.. గంగానదికి పడమటి తీరంలో ఉండసాగాడు. కానీ, కాశీని విడిచిపెట్టి వెనక్కు రాలేకపోయాడు. ఆ తరువాత ప్రమథులు కూడా వెళ్లి.. ఆ క్షేత్రంలోని అద్భుతానందాన్ని అనుభవిస్తూ అక్కడే ఉండిపోయారు. అప్పుడు డుంఠి భట్టారకుడై గణపతి వెళ్లాడు. అతడు కాశీవాసులకు అనేక దుశ్శకునాలు కల్పిస్తూ, వాటికి శాంతులు కూడా తెలియచేయసాగాడు. ఒకనాడు డుంఠి భట్టారకుని దర్శనానికి దివోదాసు వెళ్లాడు. "కాశీ ప్రజలకు ఉత్పాతాలు రావడానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు. అప్పుడు భట్టారకుడు.. "ఇటుపైన ఇంకా ఉత్పాతాలు రావడానికి అవకాశముంది. వాటిని నేను ఉపశమింప చేయగలను. కానీ, నువ్వు ఇక్కడ ఉండటం మంచిదికాదు. నేటికి పద్దెనిమిదో రోజున నీకోసం ఒక బ్రాహ్మణుడు వస్తాడు. అతడు చెప్పినట్లుగా చేయి" అని సూచించాడు. ఆయన చెప్పినట్లుగానే ఆ పద్దెనిమిది రోజులలో చాలా వింతలు జరిగాయి. విష్ణువే లక్ష్మీ గరుడ సమేతంగా దిగివచ్చాడు. వాళ్ల బోధలతో అధర్మం పెచ్చుపెరిగి పోయింది. పద్దెనిమిదో రోజున మధుసూదనుడు బ్రాహ్మణ వేషంలో దివోదాసుని కలుసుకున్నాడు. అప్పుడు విఘ్నేశ్వరుడు రాజు హృదయాన్ని ఆవేశించి ఉన్నాడు. "ఇన్నాళ్లూ నా రాజ్యంలో అకాల మరణాలు, వ్యాధులు, దారిద్ర్యం, ముసలితనం లేవు. ఎందుకో అవన్నీ ఇప్పుడు కలుగుతున్నాయి. నేను దేవతలను తృణీకరించిన అపరాధం తప్ప మరే దోషమూ ఎరుగను. ఇదంతా దేవతలు కల్పించిన నాటకంలా కనిపిస్తున్నది. ఏదేమైనా నేను చాలాకాలం రాజ్యం చేశాను. నా ఇంద్రియాలు విశ్రాంతి కోరుతున్నాయి. నేను మోక్షం కోరుకుంటున్నాను. ఏం చేయాలో సెలవియ్యండి" అని కోరాడు దివోదాసుడు. ఆపైన మధుసూదనుడు చెప్పినట్లుగా, కాశీలో లింగప్రతిష్ఠ చేశాడు. తన కొడుక్కి పట్టాభిషేకం చేసి, దైవభక్తిని ఉపదేశించాడు. తాను తపోవనానికి వెళ్లిపోయాడు. దివోదాసు వారణాసి వదిలేసి వెళ్లాడన్న వార్త విష్ణువు ద్వారా తెలుసుకున్న ఈశ్వరుడు తిరిగి వచ్చాడు. ఆయనతోపాటు సర్వదేవతలూ కాశీ చేరుకున్నారు. ఆనాటినుంచి ఈ భూమండలాన్ని దేవతలే పాలిస్తారని విశ్వేశ్వరుడు ప్రకటించాడు. దివోదాసు కథ తరువాత, కాశీమజిలీ కథల్లోని 12వ సంపుటిలో.. పుండరీకుని కథను వర్ణించారు. ఈ కథ మనందరం ఎరిగిన పాండురంగ మహత్యాన్ని చాటే పుండరీకుని కథ కాదు. వైకుంఠ సభలో ఈశ్వరుడి చేత శపించబడిన ఇంద్ర, చంద్రులు.. పుండరీక, కుమారకేసరులుగా జన్మించారు. పార్వతీదేవి శాపం వల్ల అహల్య, తార పాతాళంలో ఉదయసుందరి, తారావళులుగా పుట్టి, భూలోకంలో అనేక కష్టాలు పడ్డారు. పుండరీక, కుమారకేసరులను పెళ్లాడారు. వాళ్లే తరువాతి జన్మలో గంధర్వలోకంలో హంసుడికి మహాశ్వేతగా, చిత్రరథుడికి కాదంబరిగా.. ఈశ్వరుడి వరం వల్ల జన్మించారు. ఇంద్రచంద్రుల మరో రూపాలైన చంద్రాపీడ, పుండరీకులని వివాహమాడి సంతానం పొందగానే వారి శాపం తొలగిపోయింది. చంద్రుడి భార్య అయిన రోహిణి కూడా అతణ్ని మూడు జన్మలలోనూ అనుసరించింది. కాశీమజిలీల్లో అటుపైన వైశ్వానర, నిర్రుతి, వరుణుడు మొదలైన దిక్పతుల పూర్వగాథలు ఉంటాయి. చివరిగా మణిసిద్ధుడు, గోపాలుడు కాశీపుర ప్రవేశం చేసి, అక్కడే స్థిరపడడంతో పన్నెండో భాగం పరిసమాప్తమైంది.

